క్లుప్తంగా

పారామెడికల్ కోర్సులకు దరఖాస్తులు

తిరుపతి తుడా: ఎస్వీ వైద్య కళాశాలలో రెండు సంవత్సరాల కాలవ్యవధి గల అలైడ్ అండ్ హెల్త్ కేర్ పారామెడికల్ ప్రొఫెషనల్ కోర్సులలో ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ రవిప్రభు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ బైపీసీ, ఎంపీసీ గ్రూప్‌లలో ఉత్తీర్ణులైన విద్యార్థులు పారామెడికల్ కోర్సులకు అర్హులని తెలియజేశారు. కళాశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి 60 సీట్లు అందుబాటులో ఉన్నాయని తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వచ్చే నెల 8వ తేదీలోపు ఎస్వీ వైద్య కళాశాల పారామెడికల్ విభాగంలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9440879943 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

శాంతిప్రియకు డాక్టరేట్



తిరుపతి రూరల్ : పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం పరిశోధన విద్యార్థిని కె.శాంతిప్రియకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య అనురాధ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఆచార్య బి.విజయలక్ష్మి మార్గదర్శకత్వంలో 'ఎంపవరింగ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ త్రూ ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్' అనే అంశంపై శాంతిప్రియ పరిశోధన పత్రాలు సమర్పించినట్లు వెల్లడించారు.

'శంకరంబాడి' రచనలకు ఆహ్వానం

తిరుపతి కల్చరల్ : రాష్ట్ర గేయ రచయిత శంకరంబాడి సుందరాచారి ముద్రిత రచనలు సేకరించి సాహితీ వేత్తలకు అందించాలనే సంకల్పించినట్లు శంకరంబాడి సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మస్తానమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాహితీ వేత్తలు, కవులు, రచయితలు స్పందించి తాము చేపడుతున్న బృహత్తర కార్యక్రమానికి సహకారం అందించి శంకరంబాడి రచనలను డాక్టర్ డి.మస్తానమ్మ, శంకరంబాడి సాహితీ పీఠం, తిరుపతి, డోర్ నంబర్ 18–5–279, సప్తగిరి నగర్, తిరుపతి, చిరునామాకు పంపాలని విజ్ఞప్తి చేశారు. వివరాలకు 9948016904ను సంప్రదించాలని కోరారు.

మరింత వేగవంతంగా అభివృద్ధి

పాకాల : మండలంలోని పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ అధికారి గౌరీశంకర్‌రావు ఆదేశించారు. మంగళవారం దామలచెరువు జెడ్పీ హైస్కూల్‌ను ఆయన సందర్శించారు. జిల్లాలో మొత్తం 23 పాఠశాలల్లో పీఎంశ్రీ కింద మౌలిక వసతుల కల్పన పనులు సాగుతున్నట్లు వెల్లడించారు. ఆట స్థలం, సైన్స్ ల్యాబ్, ప్రహరీ గోడ వంటి పనులు జరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అధికారులు రవీంద్రరెడ్డి, చంద్ర, అకడమిక్ అధికారి శివశంకర్, ఎంఈఓ బాబ్జీ, హెచ్‌ఎం సుమతమ్మ, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ రమేష్, సీఆర్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

భక్తురాలికి హ్యాండ్‌బ్యాగ్ అప్పగింత



నగదును బాధితులకు అప్పగిస్తున్న టీటీడీ సిబ్బంది

తిరుమల: శ్రీవారి దర్శనార్థం వచ్చిన ఓ భక్తురాలు పోగొట్టుకున్న హ్యాండ్‌బ్యాగ్‌ను అధికారులు తిరిగి ఆమెకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. బెంగళూరుకు చెందిన జ్యోత్స్న అనే భక్తురాలు 18వ తేదీ రాత్రి సర్వదర్శనం క్యూలో స్కానింగ్ సమయంలో తన రూ.2,07,494 ఉంచిన హ్యాండ్ బ్యాగ్ పోగొట్టుకుంది. ఆ సమయంలో విధులు నిర్వహిస్తున్న ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ జీ.రాజీవ్ హ్యాండ్ బ్యాగ్‌ను గుర్తించి భద్రపరచి భక్తులకు సమాచారం అందించారు. మంగళవారం వేకువజామున వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో సదరు భక్తురాలికి హ్యాండ్ బ్యాగ్ తిరిగి అప్పగించారు. ఈ సందర్భంగా టీటీడీ సిబ్బందికి భక్తురాలు కృతజ్ఞతలు తెలియజేశారు.


అభినందన



శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పద్మావతి జూనియర్ కళాశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబరచారు. మంగళవారం ఈ మేరకు వక్తృత్వ, వ్యాసరచనలో విజేతలుగా నిలిచి బహుమతులందుకున్న విద్యార్థినులను ప్రిన్సిపల్ భువనేశ్వరి అభినందించారు. అధ్యాపకులు భవాని ప్రసాద్ పాల్గొన్నారు.

- తిరుపతి సిటీ

అమ్మ సంబరం



తిరుమలలోని వెంగమాంబ క్యాంటీన్ వెనక వైపున ఉన్న రేణుక ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం కనులపండువగా జాతర నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తుల హాజరై అమ్మవారికి పొంగల్ సమర్పించారు. ధర్మకర్త తిరుమల శెట్టి శ్రీనివాసులు, పూజారులు చిలకమ్మా, శ్రీను, బాలకృష్ణ స్వామి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

- తిరుమల

అవగాహన



స్విమ్స్ రేడియాలజీ విభాగం ఆధ్వర్యంలో రేడియాలజీ భవిష్యత్తు, క్లినికల్ ప్రాక్టీస్‌పై ప్రభావం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. రేడియాలజిస్టులు కచ్చితమైన ఇమేజింగ్ నివేదికలను సకాలంలో అందిస్తారని తెలిపారు. డాక్టర్ వీఎన్ ప్రసాద్, డాక్టర్ ముక్తేశ్వరయ్య, ప్రొఫెసర్ వై.లక్ష్మి, విభాగాధిపతి డాక్టర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

- తిరుపతి తుడా

పకడ్బందీగా పారిశుద్ధ్య నిర్వహణ

తిరుపతి తుడా : నగరంలో పకడ్బందీగా పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ఆదేశించారు. గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో భాగంగా మంగళవారం పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. ఇళ్లు, దుకాణాల ముందు డ్రైనేజీలపై నిర్మించిన ర్యాంపులు, మెట్లను తొలగించి కాలువలు శుభ్రం చేయించాలని స్పష్టం చేశారు. పలువురు కాలువలపై మెట్లు, ర్యాంపులు కట్టడంతో మురుగు కదలడంలేదన్నారు. ఈ క్రమంలో, చెత్త తొలగించడం లేదనే ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని చెప్పారు. , పట్టణ ప్రణాళిక, ఆరోగ్య శాఖ విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని ర్యాంపులు, మెట్లు తొలగించి శుభ్రం చేయించాలని ఆదేశించారు. యాదవ వీధిలో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కేజేక్స్ స్కూల్ సమీపంలో చెత్త కుప్పలు ఉండడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు అందించిన వినతులపై ఆయా విభాగాల అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని కోరారు. ఎంఈ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

భవనం కూల్చివేతపై పునఃపరిశీలన

తిరుపతి అర్బన్ : గాంధీరోడ్డులోని హథీరాంజీ మఠం భవనం కూల్చివేత నిర్ణయాన్ని పునపరిశీలించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులతో కలసి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా స్థానిక దుకాణదారులు మాట్లాడుతూ భవనం కూల్చకుండా మరమ్మతులు చేయించాలని కోరారు. సమావేశంలో నరసింహ యాదవ్, సుగుణమ్మ, విజయకుమార్, ఆర్‌సీ మునికృష్ణ, ముద్ర నారాయణ తదితరులు పాల్గొన్నారు.



చర్చిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ఎస్పీ ఆకస్మిక తనిఖీ

తిరుపతి క్రైమ్: నగరంలో ఎస్పీ హర్షవర్ధన్ రాజు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్, పూర్ణకుంభం సర్కిల్, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో విజువల్ పోలీసింగ్ చేపట్టారు. ఆటో డ్రైవర్లతో ఎస్పీ మాట్లాడుతూ భక్తులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని, అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్పీ

గోసంరక్షణ ట్రస్టుకు రూ.10లక్షల విరాళం

తిరుమల: ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్కు బెంగళూరుకు చెందిన వి.గణేష్ అనే భక్తుడు రూ.10 లక్షల విరాళం అందించారు. మంగళవారం ఈ మేరకు టీటీడీ అదనపు ఈఓ వెంకయ్యచౌదరికి డీడీ అందజేశారు.

పాలకులకు కనికరం లేదయ'..

తిరుపతి తుడా: వీళ్లంతా మానసిక, శారీరక లోపాలతో సతమతమవుతున్నవారే.. కొందరు పుట్టుకతో అవిటివాళ్లు కాగా మరి కొందరు వివిధ కారణాలచే ప్రత్యేక ప్రతిభావంతులుగా మారిపోయారు. అయితే ప్రభుత్వం ఇలాంటి వారి పట్ల కర్కశంగా వ్యవహరిస్తోంది. అమానవీయంగా వ్యవహరిస్తోంది. పింఛన్ల మొత్తాన్ని పెంచినట్టే పెంచి ఆపై కోతలు పెడుతోంది. ఎప్పుడూ లేనివిధంగా పింఛన్ల రీ వెరిఫికేషన్ ఆరు నెలల పాటు కొనసాగింది. ఇందులో భారీగా కోతలు పెట్టడంతో పింఛన్ కోల్పోయిన వారు కార్యాలయాలు, ఆస్పత్రుల చుట్టూ పరుగులు పెడుతున్నారు. పింఛన్లు కోల్పోవడంతో తమ బిడ్డలు, కుటుంబ సభ్యులను వెంట బెట్టుకుని తిరుగుతున్న తీరు దయనీయంగా మారింది. తొలగించిన పింఛన్ పునరుద్ధరించుకునే ప్రక్రియ ఎవరికి తెలియకపోవడంతో సిబ్బంది, అధికారులు ఒకరిపై ఒకరు తెప్పించుకుంటున్నారు. వారి పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. బాధితులు లబోదిబోమంటున్నారు.



పింఛన్ కోల్పోవడంతో సదరం సర్టిఫికెట్ కోసం రుయా చుట్టూ చక్కర్లు కొడుతున్న బాధితులు

ఆటో కార్మికుల సంక్షేమమే లక్ష్యం

తిరుపతి కల్చరల్ : ఆటో కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తామని సీఐటీయూ నేతలు స్పష్టం చేశారు. మంగళవారం వేమన విజ్ఞాన కేంద్రంలో ఆటో డ్రైవర్ల జిల్లా యూనియన్ రెండో మహాసభ నిర్వహించారు. సీఐటీయూ నేతలు సురేష్, బాలసుబ్రమణ్యం, కందారపు మురళి మాట్లాడారు. ఆటో రంగం రక్షణ, డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటామని యువగళం పాదయాత్రలో లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన మాటను నెరవేర్చాలని కోరారు. 13 లక్షల మందికి వాహన మిత్ర ఇస్తామని, పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. బీఎన్ఎస్ చట్టంలోని 106 1),(2)తోపాటు జీఓ నంబర్ 21 రద్దు చేయాలని కోరారు.

భక్త సులభం.. శ్రీవారి దర్శనం

- దళారులను నమ్మొద్దు : టీటీడీ

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : తిరుమల శ్రీవారి దర్శనం, వసతి గదుల కోసం దళారులను ఆశ్రయించవద్దని టీటీడీ విజ్ఞప్తి చేసింది. భక్తులకు పారదర్శకంగా, సులభతరంగా తిరుమలేశుని దర్శనభాగ్యం కల్పించేందుకు వెసులుబాటు కల్పించామని వెల్లడించారు. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించింది. దర్శన టికెట్ల కోసం టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరింది. ఈ క్రమంలోనే వసతి గదులను పొందాలని స్పష్టం చేసింది. శ్రీవారి సేవలకు సంబంధించి టీటీడీ మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో ఆధార్ కార్డు ఆధారంగా టికెట్లు బుక్ చేసుకోవాలని తెలిపింది. ఈ మేరకు సమాచారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 155257 సంప్రదించాలని వెల్లడించింది. ఎవరైనా మాయమాటలు చెప్పి మోసం చేయాలని యత్నిస్తే 0877–2263828 నంబర్‌లో టీటీడీ విజిలెన్స్ అధికారులకు సమాచారం అందించాలని పేర్కొంది.

జాబ్..లైఫ్ స్కిల్స్‌పై శిక్షణ

తిరుపతి రూరల్ : మహిళా వర్సిటీలోని ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ అడ్మిషన్ పొందిన విద్యార్థినులకు నిర్వహిస్తున్న ఓరియెంటేషన్ ఇండక్షన్‌లో భాగంగా మంగళవారం జాబ్.. లైఫ్ స్కిల్స్‌పై ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. ప్లేస్‌మెంట్ అండ్ ట్రైనింగ్ సెల్ ఆధ్వర్యంలో కౌటిల్య ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ శ్రీధర్, సీనియర్ మేనేజర్ ఎస్ ఎస్ రెడ్డి శిక్షణ తరగతులు చేపట్టారు.



మాట్లాడుతున్న కౌటిల్య డైరెక్టర్ శ్రీధర్

స్థలం కబ్జాపై కేసు

తిరుపతి క్రైమ్: తిరుపతి సుబ్బారెడ్డి నగర్‌లో స్థలం కబ్జాచేసి ఇల్లు కట్టుకున్న వ్యక్తిపై అలిపిరి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీనివాసులు అనే వ్యక్తి సుబ్బారెడ్డి నగర్‌లోని తమకు చెందిన స్థలాన్ని కబ్జాచేశాడని గీతాంజలి అనే మహిళ కోర్టును ఆశ్రయించారు. ఇల్లు ఖాళీచేసి గీతాంజలికి అప్పగించాలని కోర్టు ఆదేశాలు జారీచేసినా శ్రీనివాసులు స్పందించకపోవడంతో ఆమె అలిపిరి పోలీసులకు ఫిర్యాదు ఆమేరకు ఫిర్యాదు చేశారు. ఆమేరకు శ్రీనివాసులు, ఆయన భార్య మునిరత్నమ్మ తోపాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

వర్గీకరణ తర్వాతే నోటిఫికేషన్

తిరుపతి కల్చరల్ : రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ తర్వాతే ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్యజ్ఞప్తి చేశారు. మంగళవారం బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లోకార్యవర్గ సమావేశం నిర్వహించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. నేతలు చిన్నన్న మాదిగ, నాగభూషణం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్ రద్దు దారుణం

తిరుపతి కల్చరల్ : జిల్లాలో 30 వేల మంది దివ్యాంగుల పింఛన్ రద్దు చేయడం దారుణమని, తొలగించిన వాటిని వెంటనే పునరుద్ధరించాదలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. డాక్టర్లకు ప్రత్యేక ఆదేశాలు ఇచ్చి 60, 70 శాతం వైకల్యం ఉన్నవారిని కూడా 35,40 శాతానికి తగ్గించి అనర్హత వేటు వేయడం మోసమని మండిపడ్డారు. దివ్యాంగులకు న్యాయం చేయకుంటే ప్రత్యక్ష పోరాటంలోకి దిగుతామని హెచ్చరించారు.

ఫొటోగ్రాఫర్లకు సత్కారం

తిరుపతి కల్చరల్ : ప్రపంచ ఫొటో గ్రఫీ దినోత్సవం సందర్భంగా మంగళవారం రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో సీనియర్ ఫొటో గ్రాఫర్లను ఘనంగా సత్కరించారు. రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, ఫొటో జర్నలిస్టులు రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, ప్రవీణ్, ఫొటో గ్రాఫర్లు జయంత్‌కుమార్, గోపి పాల్గొన్నారు.



సత్కరిస్తున్న రంగస్థలి ప్రతినిధులు

జీవన నైపుణ్యాలతో వ్యక్తిత్వ వికాసం

తిరుపతి రూరల్ : జీవన నైపుణ్యాలతో వ్యక్తిత్వ వికాసం కలుగుతుందని మహిళా వర్సిటీ అధ్యయన కేంద్రం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. హైమావతి వెల్లడించారు. పద్మావతి జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన వర్క్ షాప్‌లో ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చక్కటి జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ మేరకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ప్రిన్సిపల్ డాక్టర్ భువనేశ్వరి మాట్లాడుతూ సామాజిక జీవితంలో విజయవంతమయ్యేందుకు అవసరమైన సామర్థ్యాలను పెంపొందించుకుంటే లక్ష్యాలను సాధించవచ్చని వెల్లడించారు. ప్రాజెక్ట్ అసిస్టెంట్లు ఎం.ఇంద్రాణి, వి.ప్రీతి, అధ్యాపకులు జయమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ హైమావతి

నోటీస్ బోర్డు

- తుడా మైదానంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉదయం 9 గంటలకు వినాయక నిమజ్జన ఉత్సవ కమిటీ కార్యాలయం ప్రారంభం.
- రామానుజ సర్కిల్‌లోని రెగాలియా హోటల్లో ఉదయం 10 గంటలకు రుణమేళా ,కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ పథకాలపై అవగాహన సదస్సు.
- పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు రాజీవ్ విగ్రహానికి కాంగ్రెస్ నేతల నివాళి.
- శ్రీకోదండరామాలయంలో ఉదయం 11 గంటలకు సీతారాముల కల్యాణం, సాయంత్రం 6.30 గంటలకు రామచంద్రపుష్కరిణి వద్ద ఊంజల్ సేవ.